సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

సోమవారం 9-12-2024

సంపుటి: 20 సంచిక: 217

పేజీలు: 4 వెల: రూ.1

## ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పేర్ల సురేష్ ప్రమాణస్వీకారం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా పేర్ల సురేష్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. సురేష్ గతంలో ఓసారి ఈ పదవిని నిర్వహించారు. స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయ కమిటీ అధ్యక్షునిగా పని చేశారు. జిల్లా ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షునిగా కూడా సేవలందించారు. ఇప్పుడు తాజాగా మరోసారి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, ఆంధ్రరాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు అంబికా కృష్ణ, రాష్ట్ర ఆర్యవైశ్య మహిళ గౌరవ అధ్యక్షురాలు కనుమూరి కీర్తన, జిల్లా మాజీ అధ్యక్షులు పేర్ల మహేష్, తమ్మన భాస్కర్, మండవిల్లి గుప్త, ఆర్య వైశ్య నాయకులు మండవిల్లి రవి, మండా నాగేశ్వర రావు, పేర్ల శ్రీకాంత్, పూసర్ల నగేష్, గ్రంధి నాని, మాచర్ల ఆంజనేయులు, మాటూరు దీపక్, పసుమర్తి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.







# 'ఆర్మీ కాలింగ్' వెనుక

# ఇంకెవరో ఉన్నారు!

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

- యుద్ధ్‌సేవా మెడల్ అంటే తెలుసా? దేశం తరఫున ఎన్నో యుద్ధాల్లో పాల్గొని ప్రాణాలను సైతం లెక్కచేయకుండా దేశ రక్షణ కోసం పాటుపడేవారికి ఆర్మీలో ఇచ్చే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డు ఇది. ఆర్మీలో మేజర్ జనరల్ అంటే ఏ స్థాయో తెలుసా? టూ స్టార్ ర్యాంక్ ఉన్న మేజర్ జనరల్ అంటే ఆర్మీలో దేశం మొత్తానికి నెంబర్ టూ.

.. ఇటు హోదా, అటు మెడల్ ఒకే వ్యక్తి దగ్గర ఉంటే అది ఈ దేశానికి సేవ చేసిన రాజ్‌పాల్‌సింగ్ పూనియానే. పదవీ విరమణ చేసినా ఆయనకు ఇచ్చే గౌరవంలో ఈ దేశంలో ఎటువంటి మార్పు ఉండదు. సరిగ్గా అదే వ్యక్తిని తీసుకొచ్చి ఇండియన్ ఆర్మీ కాలింగ్ పేరిట సంస్థను స్థాపించి శనివారం రాత్రి రిమాండ్‌కు వెళ్లిన బీవీ రమణ ఇక్కడ సన్మానం చేశాడు.

* * *

- జేడీ లక్ష్మీనారాయణ.. జేడీ అంటే ఆయన ఇంటిపేరు కాదు. ఆయన సీబీఐలో నిర్వహించి జాయింట్ డైరెక్టర్ హోదా. మాజీ ముఖ్యమంత్రి జగన్ మీద అక్రమాస్తుల కేసును స్వయంగా విచారించిన లక్ష్మీనారాయణ కోసం ఈ రాష్ట్రంలో చిన్న పిల్లాడ్ని అడిగినా చెబుతారు. సిన్సియర్ ఐపీఎస్ అధికారిగా ముంబైలో క్రిమినల్ గ్యాంగ్ ఆట కట్టించిన లక్ష్మీనారాయణను శ్రీకాకుళం తీసుకువచ్చి ఇదే బీవీ రమణ ఆయనతో సన్మానం చేయించుకున్నాడు.

* * *

- జిల్లాలో 14వ ఆంధ్రా ఎన్‌సీసీ బెటాలియన్ ఉంది. ఇందులో పని చేస్తున్నవారు కూడా ఆర్మీకి చెందిన ఉద్యోగులే. ఎంతోమంది ఎన్‌సీసీ బెటాలియన్ ఉద్యోగులు ఇండియన్ ఆర్మీకాలింగ్‌కు వచ్చిపోయారు.

* * *

జిల్లా నుంచి ఆర్మీలో మంచి హోదాల్లో పని చేస్తున్న ఎంతోమంది బీవీ రమణ చేతుల మీదుగా సత్కారాలు అందుకున్నారు. వీటన్నింటినీ బయటి నుంచి చూస్తున్న మనకు ఆర్మీలో సేవలందిస్తున్నవారికి రమణ సత్కరించడంలో తప్పేముందనిపిస్తుంది. కానీ ఇదే రమణ తాను ఆర్మీలో పెద్ద హోదాలో పని చేసినప్పుడు వీరందరూ తనతో కలిసిమెలిసి తిరిగినవారేనని, కొందరికి తానే శిక్షణ ఇచ్చేవాడినని విద్యార్థులకు చెప్పుకునేవాడు. తమ గురువు శత్రుదేశం మీదకు యుద్ధానికి వెళితే సింగిల్ హ్యాండ్‌తో చంపేస్తాడని భావించిన విద్యార్థులు ఆ తర్వాత నుంచి ఆయన ఏం చేసినా భరించడం మొదలుపెట్టారు. అందుకే వీపు చీరుకుపోయినా ఎవరూ నోరిప్పడానికి ముందుకు రాలేదు.

ఇన్నింటి వెనుక ఉన్న మాస్టర్‌మైండ్ కేవలం ఆర్మీలో ఓ కానిస్టేబుల్ ఉద్యోగం చేసి మానసిక స్థితి సరిగా లేక గెంటివేయబడ్డ బీవీ రమణది అంటే నమ్మలేం. కచ్చితంగా ఈ ఇండియన్ ఆర్మీ కాలింగ్ వెనుక ఇంకెవరివో అండదండలున్నాయి. అందరూ రమణ హింసిస్తున్న వీడియోలు ఎక్కడి నుంచి లీకయ్యాయని ఆలోచిస్తున్నారు తప్ప రమణ చేసిన మోసం కోసం మాట్లాడటంలేదు. జిల్లాలో మాజీ ఆర్మీ అధికారుల సంఘంలో ఉన్న కొందరికి బీవీ రమణ వ్యవహారంపై మొదట్లో అనుమానం ఉండేది. కానీ ఎప్పుడైతే రాజ్‌పాల్‌సింగ్ పూనియా వంటి ఆర్మీ శిఖరమే ఈయన వద్దకు వచ్చిందో అప్పుడే జిల్లాలో ఉన్న మాజీ ఆర్మీ ఉద్యోగులకు ఫీజులు కొట్టేశాయి. అక్కడి నుంచి తన మీద నిఘా లేదని తెలుసుకొని రమణ అందివచ్చిన ప్రతీ అవకాశాన్నీ వాడుకున్నాడు. ఇండియన్ ఆర్మీ అనే పేరు వాడుకోవడమే ఆయన చేసిన మొదటి నేరం. ఇదే మిలటరీ క్యాంపులు నడిచే రాష్ట్రాల్లో అయితే ఈ పేరు వాడినందుకు కచ్చితంగా ఆ బిల్డింగ్‌ను బ్లాస్ట్ చేసుండేవారు. రమణ అదృష్టంకొద్ది ఈ జిల్లా వెనుకబాటుతనం, ఆర్మీలో పిల్లల్ని చేర్చాలన్న తల్లిదండ్రుల తపన కలిసొచ్చాయి.

ఈ ఫొటోలో దర్జాగా కుర్చీలో కూర్చుని ఫైల్ చూసుకుంటూ వెనుక ఒకరితో తలకు మర్దన

- మిగతా 4లో





- పెద్దపెద్ద అధికారులు ఇక్కడకు రావడం ఏమిటి?
- అశ్లీల వీడియోలు ఉన్నాయన్న ప్రచారం
- డిప్యూటీ కమాండింగ్ ఆఫీసర్‌కు రేపు ఫిర్యాదు
- ఏవో శ్రీకాంత్‌ను ప్రశ్నిస్తే బయటపడనున్న వాస్తవాలు







## నాకు ఇష్టమైన జిల్లా..

# అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తా..!



- అందరూ సహకరిస్తే మార్పు వస్తుంది
- రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారుల అనుసంధానం
- ఆరోగ్యానికి ప్రాధాన్యత
- తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

(సత్యంన్యూస్, పార్వతీపురం)

జిల్లాను అభివృద్ధి చేయడంతో సార్థకత ఉంటుందని, తనకు ఇష్టమైన జిల్లా అని, అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తానని, నెలకు, రెండు నెలలకు ఒకసారి వచ్చి క్షేత్రస్థాయిలో పర్యటిస్తానని పార్వతీపురం మన్యం జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్థక, పాడి అభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అందరూ సహకరిస్తే కొంత వరకు మార్పు తీసుకు రాగలమన్న నమ్మకం ఉందన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వెనుకబడిన జిల్లా, గిరిజన జనాభా ఉన్న జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా నియమించడం తాను బాధ్యతగా తీసుకుంటానన్నారు. చాలా గ్రామాలకు రహదారి సౌకర్యం లేదని, రహదారి అనుసంధానం లేని గ్రామాలు ఉన్నాయని, రెండేళ్లలో అన్ని గ్రామాలకు రహదారులతో అనుసంధానం చేయిస్తామని, నిధులసమస్య లేదని అన్నారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై దృష్టి సారిస్తామని, మంచి వైద్యం అందాలని, సిబ్బంది, మందులు, అంబులెన్స్‌ల పరిస్థితి, రక్తహీనత వంటి అంశాలపై దృష్టి సారిస్తామని, రక్తహీనతపై ప్రత్యేక కార్యక్రమం చేస్తామని చెప్పారు. అలాగే ప్రతి ఇంటికి తాగునీరు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. సుజలధార పథకం కింద ఇతర రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వ నిధులు బాగా వినియోగించుకున్నాయని, తాగునీటి సమస్యకు శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టాలని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆలోచిస్తున్నట్టు చెప్పారు. ఇందుకు కనీసం రూ.50 నుంచి 60వేల కోట్లు వినియోగించుకోవాలనుకుంటున్నట్టు తెలిపారు. నాలుగు నియోజక వర్గాల్లో నీటి వనరులను సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని, సాగునీరుకు అంతర్రాష్ట్ర సమస్య పరిష్కారానికి కేంద్ర విమానయాన శాఖ మంత్రికి చెప్పామన్నారు. చిన్న నీటి వనరుల అభివృద్ధికి కృషి చేస్తామని, ఐటీడీఏలను బలోపేతం చేస్తామని, ఎంఎస్‌ఎంయూలు ఉన్నాయని, వివిధ పరిశ్రమలు పెట్టవచ్చని మంత్రి తెలిపారు. ఉద్యోగులు, సిబ్బంది కొరత ఉందని చెప్పారు. రహదారులు గోతులమయంగా ఉన్నాయని, రూ.850 కోట్లతో పనులు చేస్తున్నామని వివరించారు. ఉద్యోగుల కొరత ఉందని, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా 11 సార్లు డీఎస్సీ ఇచ్చారని, పాఠశాలలు మెర్జి చేశారని, మరల పునః పరిశీలిస్తున్నామని, అధికారంలో ఉంటే మంచి పని చేయాలని, చిత్తశుద్ధి ఉంటే పనులు జరుగుతాయన్నారు. సమగ్ర కలెక్టరేట్‌లు అన్ని జిల్లాల్లో ఉండాలని ముఖ్యమంత్రితో చర్చించామని, అందరు సమష్టిగా జిల్లాను ప్రగతిపథంలో నడుపుదామని పిలుపునిచ్చారు. రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి మాట్లాడుతూ విద్య, వ్యవసాయం, తాగునీరు, సాగునీరు, రహదారులకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్, మాట్లాడుతూ అందరి సహకారం, మార్గదర్శకత్వంలో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగాం శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు ఇందుకూరి రఘురాజు, పాలవలస విక్రాంత్, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పార్వతీపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బి.విజయగౌరి, ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

• ఎడిటోరియల్

# అంబేద్కర్‌ను మొక్కుతున్న మనువాదులు

అంబేద్కర్ చనిపోయి అరవై ఎనిమిదేళ్లయింది. భౌతికంగా మనకు దూరమైనా రాజ్యాంగం రూపంలో, రిజర్వేషన్ల కల్పనలో బతికేవున్నారు. అయితే మన దేశంలో రాజ్యాంగం స్థానంలో మనుస్మృతి అమలు చేయాలని కలలుగంటున్నవారు కొత్తగా అంబేద్కర్ నామస్మరణ చేస్తున్నది ఎందుకు? స్వయాన ప్రధాని మోదీ రాజ్యాంగం పీఠిక కళ్లకు అద్దుకుని మరీ అతన్ని పొగిడారు. ఆయనే కాదు, సంఘ్ పరివారమంతా కూడా నేడు అంబేద్కర్‌ను భుజాన వేసుకుని మోస్తోంది. ఆయన పేరుతో కమిటీలు వేస్తున్నది. జయంతి, వర్ధంతులను కూడా నిర్వహిస్తోంది. బీజేపీ నిజంగా అంబేద్కర్‌ను అభిమానిస్తుందా? లేకా ఇది ఆరెస్సెస్ వ్యూహమా? ఆలోచించాల్సిన సమయమిది. చరిత్రను ఓసారి పరిశీలిస్తే హిందూ మతం హింసతో జంతుబలులు చేస్తూ, యజ్ఞయాగాదులు జరుపుతూ వున్న రోజుల్లోనే బౌద్ధం పుట్టింది. అహింసావాదాన్ని ప్రచారం చేసింది. సంఘంలో ఉన్న హెచ్చుతగ్గులు పోవాలని, స్త్రీ పురుషులు సమానమనీ, మానవులంతా ఒకటేనన్నది. అందుకే ప్రజలు బౌద్ధాన్ని ఆరాధించారు, ఆదరించారు, అనుసరించారు. అప్పుడేం జరిగింది? హిందూ మతం పునరుద్ధరణ పేరిట, రాజుల సహాయంతో శంకరాచార్యులు మొదలైనవారు అడుగుపెట్టి బౌద్ధాన్ని తిరస్కరించారు. బౌద్ధ భిక్షువులను తరిమికొట్టారు. బౌద్ధ ఆరామాలను కొన్నిచోట్ల దేవాలయాలుగా మార్చారు. అయినా బౌద్ధం పూర్తిగా నాశనం కాకపోయేసరికి, బుద్ధుడిని పొగడటం ప్రారంభించారు. బుద్ధుడు కూడా మావాడే, దశావతారంలో భాగమే అని తెలివిగా స్తుతించడం, ప్రార్థించడం ప్రారంభించారు. దేవుడు లేడు అని చెప్పిన బుద్ధుడినే దేవుడిగా మార్చి కొలిచారే గానీ బుద్ధుడి భావాలు అమలుపరచలేదు. సమానత్వం అనే మూలభావాన్ని ఆచరించలేదు. మనదేశంలో బౌద్ధం నాశనమవ్వడం పునర్వికాసానికి, హేతువాదానికి, మానవవాదానికి ప్రమాదంగా పరిణమించింది. కులాల హెచ్చుతగ్గులు మళ్లీ విజృంభించాయి. బౌద్ధులకు, హిందువులకు జరిగిన పోరాటంలో అంటరానితనం పుట్టింది. సంస్కరణవాదులు ప్రయత్నించినా హిందూ సమాజంలోని దోషాల్ని తొలగించలేకపోయారు. ఈ దోషాలకు మూలాధారంగా పవిత్ర మత గ్రంథాలు, శాస్త్రాలు నిలిచాయి. వాటి జోలికిపోకుండా తలపెట్టిన సంస్కరణలు హిందూ మతాన్ని, వాటిలో వున్న దోషాల్ని తొలగించలేకపోయాయి. 20వ శతాబ్దంలో కూడా అంటరానితనాన్ని పాటించే హిందూ సమాజం ప్రపంచ దృష్టిలో తలవంపులకు గురైంది. అలాంటి స్థితిలో అంబేద్కర్ వచ్చి కూలంకషంగా హిందూ సమాజంలోని లోపాల్ని ఎత్తిచూపి వాటిపై పోరాడారు. అంబేద్కర్ కేవలం ద్వేషంతో, పగతో హిందువుల్లో అగ్రవర్ణాల వారిని, ముఖ్యంగా బ్రాహ్మణ ఛాందసులను తిట్టలేదు. సుదీర్ఘంగా పరిశోధించి, ప్రమాణాలతో విషయ పరిశీలన చేసి లోపాలను ఎత్తిచూపారు. పరస్పర విరుద్ధ విషయాలను ఎత్తి ప్రస్తావించారు. మనువు తన ధర్మశాస్త్రంలో పేర్కొన్న అధర్మమైన, అమానుష, క్రూర, ఘోర నియమాలు, నిషిద్ధాలు, అక్రమశిక్షలు, నిచ్చెనమెట్ల సమాజాన్ని బిగించిన తీరు స్పష్టంగా వివరించారు. అంటరానితనాన్ని శాస్త్రోక్తంగా సమర్థిస్తున్న అనైతిక ధర్మాలను తెలియపరిచారు. అంటరాని కులాలు, శూద్రులు దేశంలో గణనీయంగా వున్నారు. వారి ఓట్లు లేనిదే ఏ పార్టీ గెలవదు గనుక కొత్త ఎత్తుగడలతో, తాత్కాలికంగా ఓట్లను మభ్యపెట్టే వ్యూహాలతో అంబేద్కర్‌ను పొగిడే పనిలో పడ్డారు బీజేపీ నాయకులు. అంబేద్కర్ సిద్ధాంతీకరించిన వాటిని ఆమోదించి ఆచరిస్తామంటే అభ్యంతరమేమిలేదని ప్రశ్న వారినుంచి రావచ్చు. కానీ పొగుడుతూ, గోతులు తవ్వి అంబేద్కర్‌ను పూర్తిగా చంపేయాలనే ఎత్తుగడ అయితే జాగ్రత్తపడాల్సిందే! ఆ విషయం శ్రద్ధగా, లోతుగా పరిశీలించాలి. అంబేద్కర్ పేరిట ఇప్పటికే కొందరు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేస్తూ కమిటీలు వేయమనీ, విగ్రహాలు ప్రతిష్ఠించమనీ, ఉత్సవాలు జరపమనీ కోరుతున్నారు. ఇలాంటి కుహనా అంబేద్కర్‌వాదులను సంతృప్తిపరచడానికి ప్రభుత్వాలు ఎప్పుడూ సిద్ధమే. అది కూడా అంబేద్కర్‌వాదాన్ని ఉరితీసే వ్యూహమే? అయితే, ఈ విషయం గ్రహించడానికి అంబేద్కర్‌వాదులకు కొంతకాలం పట్టొచ్చు. అంబేద్కర్‌కు ప్రస్తుతం దేశంలో కొత్త అభిమానులు ఏర్పడ్డారు. బీజేపీ తమ ఎత్తుగడలో అంబేద్కర్‌ని కూడా చేర్చడం గమనార్హం. కానీ ఈ ఎత్తుగడ విఫలంగాక తప్పదు. అంబేద్కర్‌లో బీజేపీ ఆమోదించే అంశమేదీ కనిపించడం లేదు. కేవలం ఓట్ల కోసమే అంబేద్కర్‌ను శ్లాఘిస్తున్నా, అది మరీ కృత్రిమంగా కొట్టొచ్చినట్లు కనిపిస్తూనే వుంది. అంబేద్కర్ ఆశయాలు అమలుచేయాలంటే కొన్ని శాస్త్రాల్ని, గీతను, వేదాలను, రామాయణ, మహాభారతంలోని అంశాలను, ధర్మశాస్త్రాల్ని పక్కన బెట్టాలి. పాఠ్య గ్రంథాలలో ఈ అంశాలు రాకుండా చూడాలి. అంటరానితనాన్ని పాటించే ఆశ్రమాధిపతుల్ని దూరంపెట్టాలి. ఇవి చేయడానికి బీజేపీ సిద్ధపడుతుందా? అందుకే అంబేద్కర్‌లో బీజేపీవారు అంగీకరిస్తున్నదేమిటో, నిరాకరిస్తున్నదేమిటో జనానికి తెలియాలి.

## 12న వామపక్షాల పర్యటన

(సత్యంన్యూస్, పలాస)

రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్ట్ కోసం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 12న వామపక్షాల ఆధ్వర్యంలో గ్రామాలు పర్యటించాలని నిర్ణయించినట్టు వామపక్ష నాయకులు తెలిపారు. ఈమేరకు స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గోవిందరావు, సిపిఐ కార్యదర్శి చాపర వేణు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి తామాడ సన్యాసిరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావులు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెడితే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో పైడిభీమవరం నుండి ఇచ్ఛాపురం వరకు 193 కిలోమీటర్లు సముద్రతీర ప్రాంతాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టడానికి పూనుకుంటున్నారని ఆరోపించారు. గతంలో అభివృద్ధి పేరుతో ఈస్ట్ కోస్ట్ పవర్ ప్లాంట్‌కు ప్రభుత్వం 2020 ఎకరాలు భూమిని ఇస్తే ఈస్ట్ కోస్ట్ కంపెనీ బ్యాంకులో తాకట్టు పెట్టి డబ్బులు తీసుకొని దివాలా పిటిషన్ వేస్తే ప్రభుత్వం ఆక్షన్ వేసి సమీర్‌పేట్ లాజిస్టిక్ కంపెనీకు రూ.26కోట్లకు కారుచౌకగా కట్టబెట్టారని విమర్శించారు. ప్రజల ఆస్తిని కార్పొరేట్ ఆస్తిగా మార్చేస్తున్నారని వారు విమర్శించారు. దీనివలన ప్రజల జీవన విధానము ధ్వంసం అయిపోతుందన్నారు. జిల్లా సస్యశ్యామలంగా అభివృద్ధి జరగాలంటే వంశధార ప్రాజెక్ట్ నిర్మించి 50సంవత్సరాలు కావస్తున్నదన్నారు. వంశధార ఆధునికరణకు రూ.వెయ్యికోట్లు కేటాయించి చివర భూముల వరకు నీరు అందిస్తే రెండు పంటలు పండి ప్రజల ఆదాయం పెరుగుతుందన్నారు. తద్వారా ప్రజలు కొనుగోలు శక్తి పెరుగుతుందని, వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు పెరుగుతాయని, ఉపాధి దొరుకుతుందని, వలసల నివారించబడతాయని, జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. వంశధార ఆధునీకరణకు ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించడం లేదో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్ ప్రాజెక్టులు వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అభివృద్ధా! ప్రజల అభివృద్ధా? అని వారు ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ని రాష్ట్ర ప్రభుత్వం అదానీప్రదేశ్‌గా మార్చేస్తుందని ఆరోపించారు. జీడి,కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల కార్యకర్తలు పాల్గొన్నారు.





ఆంధ్రప్రదేశ్ హైకోర్ట్ జడ్జి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి జస్టిస్ ఎస్.సుబ్బారెడ్డిని సన్‌రైజ్ హోటల్‌లో జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా బార్ అధ్యక్షులు కిలారి ఈశ్వరరావు, వాన కృష్ణచంద్, కె.ఆఫీస్‌నాయుడు, డాక్టర్ ఎన్ని సూర్యారావు, అన్నెపు సత్యనారాయణ, మామిడి క్రాంతి, ఎం.అన్నంనాయుడు, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ బి.ఎస్.చలం తదితరులున్నారు. **– సత్యంన్యూస్, శ్రీకాకుళం.**

## రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల నిరసనలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రసమితి పిలుపులో భాగంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్యాలయం దగ్గర సోమవారం నిరసనలు వెల్లువెత్తాయి యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు ప్రధాన కార్యదర్శి కళ్యాణి అప్పలరాజులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్ని నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, నగర కార్పొరేషన్ కార్యాలయాల దగ్గర నిరసనలు చేపడుతున్నామన్నారు. నవంబర్ నెల వేతనం ఇంకా కార్మికుల ఖాతాలో జమ చేయకపోవడం అన్యాయమన్నారు. 2023 జనవరి 3 నుంచి చేపట్టిన సమ్మెలో భాగంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు జీతాల పెంపుకై గత ప్రభుత్వంలో అంగీకరించిన మినిట్స్‌ను అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని పర్మినెంట్ న్నారు. మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగం ఇచ్చి కార్మికుల కొరత లేకుండా జనాభా ప్రాతిపదికన కొత్తగా కార్మికులను నియమించాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు వారాంతపు సెలవు, పండుగ సెలవులు అమలు చేయాలని, విలీన పంచాయితీ కార్మికులకు డివిజన్ ఏర్పాటు చెయ్యాలని, లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్.బాబురావు, శ్యామలరావు, కిషోర్, సతీష్, ముకేష్, మాధురి, అరుణ, జయశ్రీ, ముద్దాడ రామారావు, షణ్ముఖరావు, మున్సిపల్ నాయకులు జె.గురుమూర్తి, ఎన్.పార్థసారథి, ఆర్.గణేష్, సోగ్గాడు, తారక, రామచంద్ర, రసూల్, అర్జీ గణేష్, సూర్యకళ, సరస్వతి, అరుగుల రమణ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.




## మాజీ సైనికుల యూనియన్ ఏర్పాటుపై భిన్నాభిప్రాయాలు



(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆమదాలవలసలో ఒక స్థానిక కల్యాణ మండపంలో ఆదివారం మాజీ సైనికులు కలుసుకున్నారు. విషయంలోకి వెళ్లగా ఇటీవల ఆమదాలవలస నియోజకవర్గ మాజీ సైనికుల ప్రెసిడెంట్ సూర అవతారం ఆరోగ్యం సహకరించటం లేదని తన బదులు ఇంకొక వ్యక్తిని ఆమదాలవలస ప్రెసిడెంట్‌గా నిర్ణయిద్దామని అలానే వయసుపైబడిన వారిని కూడా మారుద్దాం అని పిలుపునిచ్చారు. కానీ ఆ సమావేశంలో ఆమదాలవలస మాజీ సైనిక సభ్యులు ఒక ఏడు గురితో ఎలా ప్రెసిడెంట్‌ని నిర్ణయించారు అనే అంశాన్ని ఎక్కువమంది ఆమదాలవలస మాజీ సైనికులు లేవనెత్తారు. అంతే కాక ఆమదాలవలస యూనియన్‌లో సభ్యులు కాని వారు కొంతమంది వచ్చి ఇక్కడ ప్రభావితం చేశారని ఆరోపణలు కూడా చేశారన్నారు. ఏయే పదవులు మార్చారో వాళ్ల ప్రెజెన్స్ లేకుండా ఎలా నామినేట్ చేశారు అని అందరూ ఈ నామినేషన్‌ను ఏకముఖంగా ఖండించారన్నారు. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి మరల ఆమదాలవలస మాజీ సైనికుల యూనియన్ లెటర్‌పాడ్‌లో నున్న ప్రతీ ఒక్కరి ఒపీనియన్ తీసుకొని మల్లా యూనియన్ సభ్యులు ఎవరు ఉంటారన్నది నిర్ణయం తీసుకుందాం అని డిస్ట్రిక్ట్ ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ శ్రీకాకుళం అధ్యక్షులు, ఆమదాలవలస మాజీ సైనికుడు పూర్ణచంద్రరావు కటకం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బర్రి సంజీవరావు, తాండ్ర జనార్ధనరావు, బొడ్డేపల్లి శ్రీనివాస్, పప్పల రాజారావు, పైడి సూర్యారావు, పొన్నాడ శ్రీనివాస్, సనపల రాములు, జి. రాజారావు, జామి రమణయ్య, ఆమదాలవలస నలువైపుల నుంచి మాజీ సైనికులు పాల్గొన్నారు.



అది 2014 జూలై 31. మూడు రాష్ట్రాల సరిహద్దులు దాటి గంటకు 130 మైళ్ల వేగంతో సాగిన 65 మైళ్ల దూరం పాటు.. మూడు పోలీస్ బృందాలు ఛేజింగ్ చేస్తున్నై. కట్ చేస్తే.. యూఎస్ లోని అన్ని టీవి ఛానల్స్ లో ఒకే ఒక్క బ్రేకింగ్ కనిపిస్తోంది. ఎఫ్బీఐని సైతం ముప్పుతిప్పలు పెడుతోంది ఆ నేరస్తురాలు. ఆమె ఆచూకీ కోసం ప్రజలనూ.. నిఘా శాఖలు అర్థించేలా చేస్తోంది. ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి సంస్థతో.. ఏకంగా బాంబ్ షెల్ బ్యాండిట్ అని పిలిపించు కుంది. ఓ సినిమా స్టోరీని తలపిస్తోంది కదూ! అవునూ.. 2017లో రిలీజైన కంగనా రనౌత్ సిమ్రాన్ సినిమాకు.. మూలకథే ఇది. ఓ ఇండియన్ లేడీ.. అమెరికా నిఘా సంస్థలకు నిద్రలేని రాత్రులు మిగిల్చిన వాస్తవికత.. హాలీవుడ్ సినిమాలనే తలదన్నే ట్విస్టులతో సాగే కథ ఇది! .

# ఆమె జీవితమే.. సినిమా అయింది!

ఆమె పేరు సందీప్ కౌర్. పంజాబ్ రాష్ట్రం ఛండీగఢ్ స్వస్థలం. ఏడేళ్ల వయస్సులో తల్లి, సోదరుడితో కలిసి అమెరికాలోని కాలిఫోర్నియాలో తన తండ్రి జతీందర్ వద్ద అడుగుపెట్టింది. ఆమె తల్లిదండ్రులిద్దరూ వేర్వేరు వ్యాపారాల్లో మునిగితేలడంతో సోదరుడితో పాటు, ఆమె కూడా కాస్తా తల్లిదండ్రుల లాలనకు గురైంది. ఆ చేదు అనుభవాలు ఆమెలో ఒకింత నైరాశ్యాన్ని నింపాయి. దాంతో విసిగిపోయింది. పైగా.. అప్పటికే న్యూయార్క్ నగరంలో 2001, 9/11 ఉగ్రదాడుల అనంతరం జాతుల మధ్య ఉద్రిక్తతలూ పెరిగిపోయిన సమయం. స్కూల్ లో తోటి పిల్లలు తన తండ్రిని ఉగ్రవాదా అని అడగటం వంటివి కూడా సందీప్ కౌర్ పై కొంత ప్రభావం చూపాయి. దాంతో తన కుటుంబం పైనే సందీప్ కౌర్ కు ఏదో తెలియని వెలితి.. ఒకింత దురభిప్రాయంతో పెరిగుతూ వచ్చింది. సరిగ్గా ఆ సమయంలోనే సందీప్ కౌర్‌కు బాగా దగ్గరైంది సమీప బంధువు, స్నేహితురాలైన అమున్ దీప్ కౌర్. అప్పటికే అమెరికాలో స్థిరపడ్డ అమున్ దీప్ కౌర్.. సందీప్ కౌర్ ను సినిమాలు, షికార్లకు తిప్పుతూ బయట కొత్త ప్రపంచాన్ని చూపించింది. అలవాటు చేసింది. అలా సాగుతున్న ప్రయాణంలో సందీప్ కౌర్ తల్లి అనారోగ్యం పాలైంది. ఆ సమయంలో పొందిన ఒకింత పరివర్తనతో.. ఓ నర్స్ స్ఫూర్తితో నర్సింగ్ కోర్సులో జాయిన్ అయి.. 19 ఏళ్లకే కోర్సును పూర్తి చేసింది. పంజరంలోని రామచిలుక ఎప్పుడెప్పుడు బయటపడుతానా అన్నట్టుగా తన కుటుంబంలో ఉన్నప్పుడు భావించిన సందీప్‌కు.. అదే సమయంలో నెలకు 6వేల డాలర్లు సంపాదించే ఉద్యోగం దొరికింది. ఎలాగైనా డబ్బు సంపాదించాలన్న తపనతో పగలూ, రాత్రి కష్టపడి ఆ తర్వాత మూడు ఉద్యోగాలు చేసింది కౌర్. డబ్బుపై మరింత ఆశ పెరగడం.. అమెరికన్ వాణిజ్యరంగంలో వస్తున్న మార్పులతో షేర్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది.

2 మిలియన్ డాలర్స్ డబ్బును షేర్ మార్కెట్‌లో సంపాదించుకోగల్గింది. ఇంకేం, తానేం చేస్తే అది సక్సెస్ అవుతున్న వేళ.. అమెరికన్ కల్చర్ కు అలవాటు పడ్డ ఓ రెక్కల గుర్రంలా తనను తాను మర్చిపోయే హైహాష్ లో నడుస్తున్న జీవితకాలమది. సరిగ్గా అది 20 ఏళ్ల వయస్సు. అసలే అమెరికా పబ్బులు, క్లబ్బులు, క్యాసినోలు.. ఇక ఆ కల్చర్ అలవాటైనోళ్లకు కళ్ళు మిరుమిట్లు గొలిపే భూతల స్వర్గం! ఆ వయస్సులో మందు పుచ్చుకోవడానికీ లీగల్‌గా అమెరికా చట్టాల ప్రకారం ఇక లైసెన్సూ వచ్చేసినట్టే! అందుకు కావల్సిన డబ్బూ ఉంది! అవన్నీ చవిచూడాలన్న ఆశా ఉంది! అదిగో అలాంటి సమయంలోనే.. 20 నుంచి 21 ఏళ్ల వయస్సులో అడుగుపెట్టే పుట్టినరోజు వేళ 2010 నవంబర్ 21నాడు కౌర్ జీవితం ఊహించని మలుపు తిరిగింది. ఇంట్లో ఏదో ఓ అబద్ధం చెప్పి బయటపడ్డ కౌర్ రెక్కలొచ్చిన గువ్వలా క్యాసినోలకు పేరొందిన లాస్ వేగాస్‌లో వాలిపోయింది. ఇంకేం చేతులో బోలెడంత డబ్బు, షాపింగ్.. అసలే ఫ్యాషన్స్‌కు పుట్టినిల్లులా హొయలతో కనిపించే అమెరికాలో పొట్టి దుస్తుల్లో అలా స్నేహితులతో కలిసి మొట్టమొదటిసారి క్యాసినోలోకి ఎంట్రీ ఇచ్చింది కౌర్. ఆ క్యాసినోల్లో బ్లాక్ జాక్ జూదానికి అలవాటు పడింది. ప్రతీ నెలా ల్యాస్‌వేగాస్‌కు వెళ్లడం.. జేమ్స్ బాండ్ సినిమాల్లో తరహాలో జూదమాడటం సందీప్ కౌర్ ప్రవృత్తిగా మారిపోయింది. ఆ జూదమాటలో కౌర్ కు హ్యాండ్ కలిసివచ్చింది. ఆ

జూదమాటలో డబ్బు పోగొట్టుకుని.. చివరకు కొన్నిసార్లు ఆమె చెక్స్ బౌన్సైనా క్యాసినోలు మాత్రం ఆమెకు అడ్డుచెప్ప లేదంటే కౌర్ జీవితం క్యాసినోలతో ఎంత కనెక్టైపోయిందో అర్థం చేసుకోవచ్చు. కానీ, విధి ఎప్పుడూ ఒకే తీరుగా ఉండదు! అదృష్టం జీవితమంతా తన వెంటే.. తన క్యాసినోల వెంట తిరిగినట్టు గా రాదు! అదిగో అలా డబ్బు పోగొట్టుకోవడం ప్రారంభమైంది. ఏకంగా ఒక దశలో 60 వేల డాలర్లను పోగొట్టుకుంది. తన ఫ్రెండ్ అమున్‌దీప్‌కు మాత్రం.. ఆ డబ్బు షేర్ మార్కెట్‌లో పోయినట్టు అబద్ధమాడింది. కానీ, తన సోదరుడు ఆ విషయాన్ని అమున్ దీప్‌కు తెలియజేశాక అప్పుడు గానీ తానేవిధంగా డబ్బు పోగొట్టుకుంది. జూదామాటకు బానిసై ఎలా తన చదువు లను సందీప్ కౌర్ వదిలేసిందో అమున్ కు అర్థమవుతూ వచ్చింది. కానీ, అప్పటికే అమున్ కాదుగదా.. ఆ దేవుడే దిగివచ్చినా క్యాసినో జూదం నుండి కౌర్ ను కాపాడలేనంత పీక్‌కు వెళ్లిపోయింది. తాను బ్యాంకుల్లో ఇన్వెస్ట్ చేసిన డబ్బు కూడా అయిపోయి.. చివరకు క్యాసినోలకే ఆమె బాకీ డబ్బులు కట్టాల్సిన స్థితికి దిగజారిపోయింది.



విషయం తన తల్లికి తెలియడంతో నచ్చజెప్పి మాన్పించాల్సిన తల్లి కూడా మారు మాట్లాడలేదు. అంటే, పరోక్షంగా ప్రోత్సహించింది. డబ్బుపైనున్న మమకారం, ఓ మంచి భవంతి కొనాలన్న తల్లికున్న అత్యాశతో.. అప్పటికే ఆకాశమంతెత్తు కలలు కంటున్న కౌర్ జూదమాట పీక్‌కు చేరిపోయింది.

సాధారణంగా జూదరులందరూ ఆలోచించే తీరులోనే మళ్లీ పోగొట్టుకున్న చోటే డబ్బు సంపాదించాలన్న కౌర్‌కు.. మరి కొందరు పరిచయమయ్యారు. మీ ఆట చూశాం మీకు అప్పిస్తామన్నారు. మళ్లీ అప్పులు ప్రారంభించింది. అవి ఇంతింతై వటుడింతై అన్నట్టు పేరుకుపోయిందేగానీ ఈసారి క్యాసినోల్లో జూదమాట మాత్రం కౌర్‌కు కలిసి రాలేదు. దాంతో అప్పులోళ్ల బాధలు పెరిగిపోయాయి. వాటికి వడ్డీలు, చక్రవడ్డీలు కలిసి బారెడయ్యాయి. ఇక చేసేది లేక.. తల్లిని తీసుకుని తన ఠికాణా మార్చింది. అయినా అడ్రస్ వెతుక్కుంటూ వచ్చిన అప్పులోళ్లు కుటుంబాన్నే లేకుండా చేస్తామని బెదిరించారు. ఎలాగైనా అప్పు తీర్చాలన్నారు.

ఆ క్రమంలో బ్యాంకులకు కన్నం వేయడం ఒక్కటే మార్గమన్న దొంగబుద్ధులు సూచించారు కొందరు. అలా ఓ నర్స్‌గా అమెరికాలో జీవితాన్ని ఓ ఇండియన్ లేడీ అమెరికా పోలీస్ వ్యవస్థనే ముప్పు తిప్పలు పెట్టే ఓ బ్యాంక్ దోపిడి దొంగగా రూపాంతరం చెందింది. పలు బ్యాంకులకు కన్నం వేసి.. తప్పించుకుని తిరిగింది.

చాలామంది దొంగలు బ్యాంకు దొంగతనాల్లో పోలీసుల కాల్పుల్లో మరణించిన సంఘటనలు తన కళ్లముందు కదలాడినా తానిక బ్యాంక్ దొంగతనాలు చేస్తేనేగానీ తాను, తన కుటుంబం బతికి బట్టకట్టలేమని భావించింది. ఒక దశలో ఆత్మహత్యే శరణ్యమనుకున్న కౌర్.. ఆ తర్వాత ఏకంగా అమెరికా పోలీస్ వ్యవస్థలోనే అత్యధిక బ్యాంక్ రాబరీలకు పాల్పడ్డ ఓ ఆడ గజదొంగగా గజగజలాడించింది.

ఉటాలోని సెయింట్ జార్జ్ బ్యాంకులో రాబరీకి సరిగ్గా 2014, జూలై 31, సోమవారం రోజు పక్కా ప్రణాళికను రచించింది. కానీ అమెరికా ఎఫ్బీఐ లెక్కల ప్రకారం సోమవారాలు అక్కడ అంతకుముందు కూడా పలు బ్యాంకు దోపిడీలు జరిగిన సంఘటనలుండటంతో అప్పటికే కౌర్ గురించి వెతుకుతున్న పోలీస్ శాఖ అప్రమత్తమైంది. అనుకున్నట్టే కౌర్ ఆ బ్యాంకుకు వచ్చింది. కానీ మారువేషంలో కళ్లకు గాగుల్స్‌తో పాటు విగ్ ధరించిన ఆమె రూపం పోల్చుకోలేకుండా ఉంది. కానీ, ఆమె కదలికలు బ్యాంకులో అనుమానాస్పదంగా కనిపించాయి. పైగా క్యాషియర్‌ను డబ్బు ఇవ్వమని బెదిరించి గుంజుకెళ్లుతుండగా తన క్యాబిన్‌లోంచి చూసిన మేనేజర్ పోలీసులకు సమాచారమిచ్చాడు. దాంతో కౌర్ సుదీర్ఘ ఛేజింగ్ అనంతరం పోలీసులకు చిక్కింది. ఆ సమయంలో అక్కడున్న తీవ్ర తుఫాన్ పరిస్థితులు కూడా కౌర్‌ను పోలీసులకు పట్టించాయి. చివరాఖరకు అమెరికా పోలీసులకు చేతికి చిక్కి 66 నెలల జైలు శిక్షగా న్యాయమూర్తి ఇచ్చిన తీర్పుతో.. తన జీవితకాల పరుగుకు ఓ విచారకరమైన, విషాదకరమైన ఎండింగ్ తో జైలు ఊచలు లెక్కిస్తోంది. అమెరికా పోలీస్ వ్యవస్థనే ఓ కుదుపు కుదిపి.. సంచలనమైన సందీప్‌కౌర్ స్టోరీ ప్రతీ మలుపులో ఓ సంచలనమే కనుకే.. ఏకంగా సినిమా తెరపైకే ఎక్కేసింది.

– బాతాఖానీ.కామ్ సౌజన్యంతో...

## యూత్ రెడ్‌క్రాస్ విభాగం ఏర్పాటు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కాలేజ్ (ఉమెన్స్)లో యూత్ రెడ్‌క్రాస్ విభాగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ పి.జగన్మోహనరావు, కే.శివశంకర్, ప్రిన్సిపల్‌లు యూత్ రెడ్‌క్రాస్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు విద్యతో పాటు సమాజసేవలో ముందుండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ప్రోగ్రాం మేనేజర్ జి.రమణ, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వేణు, యూత్ రెడ్ క్రాస్ కాలేజ్ కన్వీనర్ మోహన్ రావు, రెడ్ క్రాస్, పి.ఆర్.ఓ. చైతన్య కుమార్, ఉమా శంకర్, పవన్, కాకినాడ ఆదిత్య సిబ్బంది పాల్గొన్నారు

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడిగా పాలకొండ వాసి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఈ నెల 8న విజయవాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ & జగజ్జీవన్ రామ్‌భవన్‌లో జరిగిన హెల్పింగ్ హ్యాండ్స్ ఎనిమిదవ వార్షికోత్సవ వేడుకలో భాగంగా హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ మరీదు శివరామ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నూతన ఎన్నిక కమిటీలో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలం మల్లివీడు గ్రామానికి చెందిన యవర్న శేఖర్ హెల్పింగ్‌హాండ్స్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. పెదపొల్ల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ సమాజానికి తనవంతుగా సేవ చేయాలని భావనతో రక్త, అన్న దానాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆపదలో ఉన్నవాళ్లకు ఆర్థిక సహాయాలు, చలికాలంలో నిరాశ్రయులకు దుప్పట్లను పంపిణీ చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. రాష్ట్ర అధ్యక్షుడుగా ఎంపిక అయినందున గ్రామప్రజలు, స్నేహితులు, అభినందనలు తెలియచేసి సమాజానికి మరిన్ని సేవలు అందించాలని కోరుకుంటున్నారు.

## ఏసీ రిపేరింగ్‌లో ఉచిత శిక్షణ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్‌లో ఉచిత ఏసీ టెక్నీషియన రిపేర్ కోర్స్ నిరుద్యోగ యువతి యువకులకు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు టెన్త్ క్లాస్ నుండి డిగ్రీ, బీటెక్, ఎవరైనా అర్హులేనన్నారు. రిజిస్ట్రేషన్ కొరకు స్కిల్‌హబ్ కో- ఆర్డినేటర్ బి.సత్య సాయి వెంకటేష్‌ను 7569077449 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రేషన్ డీలర్లకు న్యాయం చేయండి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్న రేషన్‌డీలర్ల సమస్యలపై స్పందించి తమకు న్యాయం చేయాలని జిల్లా డీలర్ల సంఘం కోరింది. ఈమేరకు సోమవారం జేసీ, డీఎస్ఓ, ఎమ్మెల్యే గొండుశంకర్‌ను సంఘ ప్రతినిధులు పట్నాల కోటేశ్వరరావు, పొట్నూరు రమేష్, పొట్నూరు వెన్నారావులు కలిసి వినతిపత్రం అందజేశారు. గడిచిన ప్రభుత్వ కాలంలో అనగా 2023-24కాలంలో శ్రీకాకుళం ఎమ్మెల్యేస్ పాయింట్ పరిధిలో గల మూడు మండలాలైన శ్రీకాకుళం, గార, ఎచ్చెర్ల మండలాలు కలిసి మొత్తంగా 200 ఎఫ్‌పీ షాపులు ఉండేవన్నారు. దీంతో తమ సమస్యలు ఏమున్నా 200 మంది కూడా ఎమ్మెల్యేస్ పాయింట్ దగ్గర వెళ్లి వేయింగ్ వేసి తీసుకోవడం లేదంటే మా గ్రామం దగ్గరలో ఉన్న వేబ్రిడ్జ్‌లో కాటా వేస్తూ తీసుకుండేవారనమన్నారు. ప్రస్తుతం శ్రీకాకుళం మండలం సంబంధించి 90 షాపులకు గాను 19 నరసన్నపేటకు 4 ఎఫ్‌పీ షాపులు, ఆమదాలవలసకు 15 ఎఫ్‌పీ షాపులు, గారకు సంబంధించి 22 నరసన్నపేటకు, ఎచ్చర్ల మండలం సంబంధించి ఐదు ఎఫ్‌పీ షాపులు లావేరు ఎమ్మెల్యేస్ పాయింట్లు కలిపివేశారన్నారు. దీంతో తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని, ఈ పాయింట్లను యధావిధిగా కొనసాగించాలన్నారు.



## పెద్దలసభకు ఆర్ క్రిష్ణయ్య

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

భారతీయ జనతా పార్టీ వివిధ రాష్ట్రాలకు సంబంధించి రాజ్యసభ అభ్యర్థులను సోమవారం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీల పెద్దన్న ఆర్.క్రిష్ణయ్య పేరును ప్రకటించడం ఆనందంగా ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బుడుమూరు రాజేష్ ప్రకటించారు. ఈ సందర్భగా బుడుమూరు రాజేష్ భారతీయ జనతా పార్టీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భగా భారతీయ జనతా పార్టీ బీసీల ఇచిన్న గౌరవంగా భావిస్తున్నామని బీజేపీ కేంద్రంలో అధికారం ఉందని, కావున బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి వారికి చట్టసభల్లో 50% రిజర్వేషన్‌లు కల్పించాలని కోరారు.



## పింఛన్ల పంపిణీలో కూటమి రాజకీయం

(సత్యంన్యూస్, పాతపట్నం)



కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో పింఛన్ల మంజూరు కోసం కొత్తగా ఎవరైనా అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయిందని రెడ్డి శాంతి గారు ధ్వజమెత్తారు. ఈమేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే ఆన్లైన్ సేవలు సైతం పూర్తిగా నిలిచిపోయాయన్నారు. గతంలో అర్హులు ఏడాదిలో ఏ రోజైన తమ ఊరిలోని గ్రామ, వార్డు సచివాల యాల్లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండేదని, ఇప్పుడు రాష్ట్రం లోని అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆ సేవలు పని చేయడం లేదన్నారు. ఈ ఏడాది జనవరిలో అప్పటి జగన్మోన్‌రెడ్డి ప్రభుత్వం కొత్త పింఛను మంజూరు చేసిన తర్వాత ఇప్పటి వరకు మళ్లీ కొత్త పింఛన్ల మంజూరు కాలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నీరుగార్చడమే కాకుండా వలంటీర్ల వ్యవస్థనే లేకుండా చేసిందన్నారు. తాము అధికారంలోకి వస్తే వాలంటీర్లకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం ప్రస్తుతం దాని ఊసే ఎత్తడం లేదన్నారు.

### 14, 15 తేదీల్లో మానవహక్కుల వేదిక మహాసభలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మానవ హక్కుల వేదిక రెండు తెలుగు రాష్ట్రాల మహాసభలు ఈనెల14, 15 తేదీల్లో అనంతపురంలోని అంబేద్కర్‌భవన్‌లో జరుగుతాయని వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు కేవీ జగన్నాధరావు, ఉత్తరాంధ్ర జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షులు చౌదరి లక్ష్మణరావులు తెలిపారు. ఈమేరకు వారు సోమవారం శ్రీకాకుళంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. 14న సంస్థాగత కార్యక్రమం, 15న సమకాలనీ అంశాలపై సదస్సు ఉంటుందన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్నతమైన స్థానాల్లో ఉన్న వక్తలు మాట్లాడుతారని, అందరూ ఆహ్వానితులేనన్నారు. నేడు ప్రభుత్వాలు అన్ని అంశాల్లోనూ ప్రజలను అణిచివేస్తున్నాయన్నారు. ఇటువంటిస్థితిలో మానవహక్కుల అవసరం ఉందన్నారు.

## గద్దర్ జాతీయ పురస్కారానికి యోగి ఎంపిక

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ప్రజా ఉద్యమాలలో సాగుతున్న ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు వాబ యోగికి ప్రజా యుద్ధనౌక గద్దర్ జాతీయ పురస్కారంకు ఎంపికయ్యారని అవార్డు నిర్వహణ కమిటి సభ్యులు ఆతవ ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డా.అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో ఈనెల 12న మమత స్వచ్ఛంద సేవా సమితి (రిజిష్టర్ 196/2013) ద్వారా తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డా.వెన్నెల గద్దర్ (గద్దర్ కూతురు చేతుల మీదుగా) అవార్డు ప్రధానం చేయనున్నారు. పాలకులు ఎవరైనా పేదల పక్షాన పోరాడే వాబ యోగికు ఈఅవార్డు రావడం ఎంతో సంతోషదాయకమని పలు ప్రజా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

## దివ్యాంగులకు సహకారం అందించాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

దివ్యాంగుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వాలు సహకరించాలని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ పేర్కొన్నారు. స్థానిక బెహరా మనోవికాస కేంద్రంలో ది న్యూ ఫ్రెండ్స్ ఆఫ్ ఎర్త్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్ 25వ వివాహ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఎన్ఆర్ శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ దివ్యాంగుల సర్వతో అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు కూడా సంపూర్ణ సహకారం అందించి దివ్యాంగుల జీవితాల్లో నూతన ఉత్తేజం తేవాలన్నారు. డాక్టర్ రమా శ్రీనివాస్ పట్నాయక్ మాట్లాడుతూ దివ్యాంగులు పట్ల ప్రేమ వాత్సల్యంతో పాటు వారి విద్య ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ గురుతర బాధ్యతగా సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కరకవలస వినీలభాయి పట్నాయక్, పోలుమహంతి ఉమామహేశ్వరరావు, కరుణాకర్ భాస్కర్, శ్రీమతి శ్యామలకుమారి, పొన్నాడ రుషీశ్వరరావు, శ్రీమతి ఆళ్ల ఇందుమతి బెహరా మనోవికాస్ కేంద్ర నిర్వాహకులు సిబ్బంది పాలొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు వస్త్ర విత్తరణ నిర్వహించారు. కేకులు బిస్కెట్లు పంపిణీ చేశారు



### అయోధ్యలో శ్రీకాకుళం జిల్లా విద్యార్థిని కూచిపూడి ప్రదర్శన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో అయోధ్యలో శ్రీకాకుళం జిల్లా గొల్లవలస గ్రామానికి చెందిన నీలంరాజు లక్ష్మి నాగసాయి భువిక ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీ సాయి నటరాజ ఆర్ట్స్ అకాడమీ తిరుపతి వారిచే అయోధ్యలో నిర్వహించిన శ్రీరామ సంగీత నృత్యాంజలి 2024 కార్యక్రమంలో ఈ బహుమతి అందుకుంది. భువిక 4 సంవత్సరాలుగా విజయవాడ కు చెందిన డాక్టర్ అజయ్‌కుమార్ వద్ద కూచిపూడి శిక్షణ పొందుతుంది. భువిక ఈ బహుమతి గెలుచుకున్నందుకు సెయింట్ క్లారిటీ ప్రిన్సిపల్ బాలకుమార్, గొల్లలవలస గ్రామస్తులు, తల్లితండ్రులు నీలం రాజు, శరత్‌కుమార్ కృష్ణకుమారి హర్షం వ్యక్తం చేశారు.




## మౌలిక సదుపాయాలు కల్పించాలి

(సత్యంన్యూస్, కొత్తూరు)

అన్ని రంగాల్లోనూ వెనుకబడిన గిరిజన గ్రామాలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం నాయకులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు తహశీల్దార్ కె.రవిచంద్రను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం సిర్ల ప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77ఏళ్లు పూర్తి కావస్తున్న గిరిజన గ్రామాలు నేటికీ మౌలిక సదుపాయాలకు నోచుకోవడం లేదన్నారు. నేడు చేపట్టిన ధర్నాకు తరలివచ్చిన ప్రజలే నిదర్శనమన్నారు. తక్షణమే ఐటీడీఏ అధికారులు స్పందించి తగిన వసతులు కల్పించాలని కోరారు.






జిల్లా విస్తృత పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్‌ను భోగాపురం రిసార్ట్‌లో జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జనసేన కార్యదర్శులు వడ్డాది శ్రీనువాసరావు, తాళాబత్తుల పైడిరాజు, చిట్టి భాస్కరరావు, ముంగి జగదీశ్వరరావు, పైడిభీమవరం సీనియర్ జనసేన నాయకులు ఇనికోటి రాంబాబు, మహేష్ తదితరులున్నారు. - సత్యంన్యూస్, శ్రీకాకుళం.

# మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలి

(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వాలని, గిరిజన గ్రామాలు సమగ్రాభివృద్ధి చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో మెళియాపుట్టి తహశీల్దారు కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ ఐటీడీఏ ఉన్న సీతంపేట జిల్లాల విభజన వలన మన్యం పార్వతీపురం జిల్లాకు వెళ్లిపోవడంతో శ్రీకాకుళం జిల్లాలో ఐటీడీఏ లేదన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మెళియాపుట్టి మండల కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేస్తే గిరిజనులు సమగ్రాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. మండలంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పూర్తిస్థాయిలో పట్టాలు ఇవ్వలేదని, అటవీ హక్కులు చట్టం-2006 ప్రకారం గిరిజనులు సాగుచేస్తున్న పోడువ్యవసాయానికి 10 ఎకరాల వరకు పట్టాలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ సాగు చేస్తున్న భూమిలో అరకొర మాత్రమే ఇచ్చారని తెలిపారు. గిరిజన గ్రామాలలో ఇప్పటికీ సరైన రోడ్లు లేవని, కొండను ఆనుకొని ఉన్న గ్రామాలకు రక్షణ గోడలు లేకపోవడంతో వర్షాలు పడితే కొండపై నుండి నీరు ఇళ్ళలోకి వచ్చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొండను ఆనుకుని ఉన్న గ్రామాలలో కొండపై నుండి వర్షపు నీరు గ్రామాలలోకి రాకుండా రక్షణ గోడ నిర్మించాలన్నారు. అనేక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ఒక ఉపాధ్యాయునితో ఉండటం వలన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదని, ఇల్లయపురం నుండి అంపురంకు పక్కా రోడ్డు వేయాలన్నారు. నేలబొంత నుండి గొట్టిపల్లికి మరియు ముత్యాలబొంత




రోడ్డు బాగు చేయాలని, కొత్తూరు నుండి బందపల్లి వరకు రోడ్డు పనులు పూర్తి చేయాలని, కేరాసింగ్ గూడకు సిమెంట్ రోడ్డు వేయాలని డిమాండ్ చేసారు. సాగు చేస్తున్న బంజరు, పోరంబోకు, సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు భూములు పట్టాదారులకు రైతు పెట్టుబడి సాయం, పిఎం కిసాన్ నిధి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 50% దాటి జనాభా గల గిరిజన పంచాయతీలను 5వ షెడ్యూల్డ్ లో చేర్చాలని, గిరిజన పంచాయతీలకు 1/70 చట్టం అమలు చేయాలని కోరారు. వ్యవసాయానికి సాగునీరు కొరకు చెక్ డ్యాంలు నిర్మించాలని కోరారు. గ్రామాలలో సామాజిక భవనాలు నిర్మించాలని, వీధులలో పాడైపోయిన సీసీ రోడ్లు స్థానంలో కొత్తవి వేయాలన్నారు. ధర్నా అనంతరం డిప్యూటీ తహశీల్దారుకు వినతిపత్రం ఇచ్చారు. ఆదివాసీ గిరిజన సంఘం గౌరవ అధ్యక్షులు పి.ప్రసాదరావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్. అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి, కె.సూరయ్య గిరిజనులు ఎస్.శ్రీను, ఎస్.ప్రసాద్, ఎస్.ధర్మారావు, ఎస్.సుబ్బారావు, బి.శ్యాంసుందరరావు, పెద్దబొంతు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలకు మమకార భాష కావాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుబడి భాషగానే కాదు అమ్మ ఒడి భాషగానే చూడాలని ప్రజలు మమకారభాషగానే భావించినపుడు తెలుగు అమృత భాషగా కాలంతో పాటు నిలుస్తుందని ఆంధ్ర సారస్వతా పరిషత్ అధ్యక్షులు ప్రపంచ ప్రఖ్యాత గజల్ గాయకులు డాక్టర్ గజల్ శ్రీనివాస్ పేర్కొన్నారు. రంగస్థల కళాకారుల రజతోత్సవ వేడుకలకు హాజరైన శ్రీనివాస్ ఆంధ్ర సారస్వతా పరిషత్ శ్రీకాకుళంశాఖ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వెలుగులు విశ్వవ్యాప్తం చెయ్యాలని ఆంధ్రమేవ జయతే అన్న నినాదంతో ప్రపంచస్థాయి తెలుగు మహాసభలను అనేక వ్యయ ప్రయాసలకోర్చి విజయవంతంగా నిర్వహించడం అదృష్టమన్నారు. 2002లో భీమవరం, 2004లో రాజమండ్రి నిర్వహించామని 2026 జనవరిలో అమరావతిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచం నలుమూలల నుండి అతిరధ మహారదులు, యాభై దేశాల నుండి ప్రముఖులు, దేశాధినేతలు హాజరవుతారని ఈ సభలలో అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు అన్నారు. ఆ సభలకు సన్నాహక సభలను శ్రీకాకుళం నుండి శ్రీకారం చుడుతున్నామని తేదిలను త్వరలో ప్రకటించనున్నట్లు తెలిపారు. సభా నిర్వహణలో వివిధ అంశాలపై సలహాలు సూచనలు స్వీకరిస్తామన్నారు.

ఆంధ్ర సారస్వతా పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి, శ్రీకాకుళం జిల్లా సంచాలకులు లఖినాన. రవికుమార్ అధ్యక్షతన స్థానిక యుటిఎఫ్ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా కార్యదర్శి సంపతిరావు సౌమ్య, కోడూరి సుశీల, నియోజకవర్గ సమన్వయకర్తలు సాహితీ వేత్తలు, కవులు పాల్గొన్నారు.


















# 'ఆర్మీకాలింగ్' వెనుక ఇంకెవరో ఉన్నారు!

(మొదటిపేజీ తరువాయి)

చేయించుకుంటున్న ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ వ్యవస్థాపకుడు బీవీ రమణ జిల్లాలో అనేకమంది ప్రముఖులకు, సెలబ్రిటీలకు ఓం భీం బుస్ చేసేశాడు. ఆర్మీలో ఉద్యోగాలిప్పిస్తామని, అందుకోసం ముందుగా శిక్షణ తీసుకోవాలని ఏర్పాటుచేసిన ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థలో పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చారంటే ఒక అర్థముంది. నగరంలో ప్రముఖులు, పోలీసు అధికారులు, చివరకు ఆర్మీలో సేవలందించి ఇప్పుడు రిటైర్డ్ అధికారులుగా ఉన్నవారు కూడా బీవీ రమణ మంత్రానికి పడిపోయారు. రమణ తాను ఆర్మీలో కల్నల్‌గా చేశానని కొందరికి, లెఫ్టినెంట్‌గా చేశానని మరికొందరికి చెప్పుకొచ్చారు. ఆర్మీ డిజిగ్నేషన్ల మీద సామాన్యుడికి పెద్దగా అవగాహన ఉండకపోవడం సహజం. కానీ ఇక్కడ రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు కూడా రమణ చెప్పినదానిపై అనుమానం రాకపోవడమే విచిత్రం. వాస్తవానికి ఐటీబీపీ విభాగంలో కానిస్టేబుల్‌గా రమణ పనిచేసేవాడు. మానసిక పరిస్థితి బాగోలేదని ఈయన్ను విధుల నుంచి తప్పించారు. కానీ రమణ లెఫ్టినెంట్ హోదాలో ఉన్నట్టు ఒక ఐడెంటిటీ కార్డు ట్రోల్ అవుతోంది. దీనిపై పోలీసులు కూడా రమణను ప్రశ్నించారు. తన వద్ద ఆ కార్డు లేదని, ఎవరో తయారుచేసి ట్రోల్ చేస్తే, అందుకు బాధ్యత తనది కాదంటూ చెప్పుకొచ్చినట్టు తెలుస్తుంది. వాస్తవానికి ఇండియన్ ఆర్మీ కాలింగ్ పేరిట ఎటువంటి రిజిస్ట్రేషన్ రమణకు లేదు. ఆర్మీలో పెద్ద స్థాయిల్లో పని చేసి పదవీ విరమణ చేసిన తర్వాత డిఫెన్స్ అకాడమీలు పెట్టుకోడానికి ఇటు ఆర్మీ, సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు ఇస్తాయి. కానీ ఇక్కడ రమణ ఆఫీసరూ కాదు, ఆయన సంస్థకు గుర్తింపూ లేదు. కానీ ఎంచక్కా త్రివిధ దళాలకు చెందిన జెండాలను, లోగోలను ఆయన విచ్చలవిడిగా వాడేసుకున్నారు. రమణ తక్కువ సొమ్ములే వసూలుచేసి విద్యార్థులకు శిక్షణ ఇచ్చేవాడని ఇప్పటికీ కొందరు ఆయన్ను వెనకేసుకొస్తున్నారు.

ఇండియన్ ఆర్మీ కాలింగ్ అనే సంస్థ పెట్టిన తొలిరోజుల్లో రమణ ఇబ్బందిపడివుండవచ్చు. కానీ, ఆ తర్వాత తన ఆర్మీ కోచింగ్ సెంటర్‌ను కాస్తా బౌన్సర్ల టీమ్‌గా తయారు చేసేశారు. స్థానిక 80 అడుగుల రోడ్డులో ఉన్న ఖాళీ స్థలంలో ఫిజికల్‌గా రాటుదేలిన విద్యార్థులను నిరంతరం ఏదో ఒక షాపు ఓపెనింగ్, ప్రైవేటు ఫంక్షన్లు, పబ్లిక్ ఫంక్షన్లలో సెక్యూరిటీ గార్డులుగా వినియోగించి సంబంధిత సంస్థల నుంచి రమణ కొంత మొత్తాన్ని వసూలు చేసేవారని తెలుస్తుంది. స్థానిక ఎస్ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి కూడా ఇందులో భాగంగానే పట్టుకెళ్లారు. అక్కడ పెద్ద ఎత్తున వస్త్రాలు దొంగతనాలు జరిగాయని, అవి సీసీల్లో రికార్డయ్యాయని, ఫిర్యాదు ఇస్తామని సంబంధిత యాజమాన్యం భయపెట్టడంతో విద్యార్థులను గొడ్డును బాదినట్టు బాదాడు.

అసలు కాలేజీలో ఇంటర్ చదువుకొనే విద్యార్థులు షాపింగ్‌మాల్స్ ఓపెనింగ్‌కు, పెద్దల ఇంట్లో జరిగే పెళ్లిళ్లకు వెళ్లాల్సిన అవసరం ఏమొచ్చింది? ఈ ప్రశ్న కూడా ఏ రోజూ ఇక్కడ అధికారుల మెదడులో మొలకెత్తలేదు. ఇక శ్రీకాకుళంలో 5కె, 10కె రన్‌లు జరిగినా ఇండియన్ ఆర్మీ కాలింగ్ విద్యార్థులనే ముందు పెట్టేవాడు. దీని ద్వారా ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు, నగరంలో ప్రముఖులందరి దృష్టిలోనూ పడాలని రమణ తపన పడ్డాడు. ఇండియన్ ఆర్మీ కాలింగ్‌లో విద్యార్థుల సంఖ్య రానురాను పెరగడం, దీన్ని ఒక పద్ధతి ప్రకారం మార్కెటింగ్ చేయడం కానిస్టేబుల్ స్థాయిలో పని చేసిన రమణ లాంటి వ్యక్తుల బుర్రకు తోచింది కాదు. దీని వెనుక కచ్చితంగా ఓ మాస్టర్‌మైండ్ ఉండే వుంటుంది. ఎందుకంటే తన సంస్థ పేరుతో రమణ నగరంలో చాలామందికి దగ్గరయ్యాడు. చివరకు మాజీ ఆర్మీ అధికారులతో కూడా సన్మానం చేయించుకునే స్థాయికి రమణ పెరిగిపోయాడు.

రెండు చోట్ల హాస్టళ్లు, ఓ కారు మెయింటినెన్స్ వంటివి విద్యార్థుల ఫీజులతో నడిచే వ్యవహారం కాదు. అంతకు మించి ఈ సంస్థలో ఏదో జరుగుతోంది. దీని వెనుక ఎవరో ఉన్నారన్న అనుమానం ఇప్పుడిప్పుడే బలపడుతోంది. మంగళవారం ఉమ్మడి



తెలుగు రాష్ట్రాల్లో ఆర్మీకి చెందిన డిప్యూటీ జనరల్ కమాండింగ్ ఆఫీసర్ బ్రిగేడియర్ ఎన్‌వీ నంజుదేశ్వర వస్తున్నారు. ఈ సందర్భంగా ఇండియన్ ఆర్మీ కాలింగ్ రచ్చ మీద ఆయనకు ఒక నివేదిక సమర్పించడానికి మాజీ ఆర్మీ ఉద్యోగుల సంఘం సిద్ధపడుతోంది.

వాస్తవానికి ఈ సంస్థను నడిపిస్తున్నది అక్కడ ఏవోగా పనిచేస్తున్న శ్రీకాంత్. రమణ పెట్టిన నిబంధనలను పూర్తిగా అమలు చేయడం శ్రీకాంత్ వంతు. ఇందులో భాగంగానే విద్యార్థులను చాలాసార్లు శ్రీకాంత్ కూడా చావచితక్కొట్టాడని తెలుస్తుంది. ఉద్యోగులతో పని చేయించుకోవడం, జీతాలు ఇవ్వకపోవడం, హాస్టల్‌లో ఉన్న అమ్మాయిలు, అబ్బాయిలకు బ్రెయిన్‌వాష్ చేయడం వంటివి శ్రీకాంతే చేస్తుంటాడని వినికిడి. రమణ కూడా పోలీస్ ఇంటరాగేషన్‌లో ఎక్కడా శ్రీకాంత్ పేరు చెప్పలేదని, ఆయన బయటవుంటే తన బెయిల్‌కు ప్రయత్నిస్తాడన్న కోణంలోనే శ్రీకాంత్ ఊసెత్తలేదని తెలుస్తుంది. ఈ సంస్థలో మొత్తం ఆర్థిక వ్యవహారాలన్నీ శ్రీకాంతే చూస్తుంటాడు. శ్రీకాంత్‌కు సంబంధించిన వీడియోలతో పాటు మరికొన్ని వీడియోలు కూడా విడతలవారీగా విడుదల కానున్నాయని భోగట్టా. ఈ సంస్థలో పనిచేసి జీతాలివ్వక ఏడాది క్రితం వెళ్లిపోయిన కొందరు అప్పట్లో ఉన్న సీసీ ఫుటేజీని స్టోర్ చేసుకొని ఇప్పుడు విడుదల చేస్తున్నారని పోలీసులు భావిస్తున్నారు. ఇందులో వాస్తవమెంత ఉందో తెలియదు కానీ 2018 నుంచి విడతలవారీగా జిల్లాలో అంటకాగిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, ప్రముఖులు ఇప్పుడు తమ బండారం బయటపడుతుందన్న బెంగతో బిగుసుకుపోతున్నారు. తాజాగా ఏ హాస్టల్‌లో అయితే విద్యార్థి మీద రమణ పశువులా ప్రవర్తించాడో అదే హాస్టల్ కాంపౌండ్‌ను బిల్డింగ్ యజమానులు ఆదివారం ఖాళీ చేయించారు.

# తల్లిదండ్రుల పేరిట సేవ స్ఫూర్తిదాయకం

**ఎమ్మెల్యే గొండు శంకర్ । చిన్నారావు, చిన్నమ్మడు పేరిట పేదలకు వస్త్రదానం, అన్నసంతర్పణ**



(సత్యంన్యూస్, గార)

దివంగత కొన్న చిన్నారావు, చిన్నమ్మడు దంపతుల జ్ఞాపకార్థం సాలిహుండం గ్రామ పంచాయతీ కొంక్యానపేట గ్రామంలో కుటుంబ సభ్యులు వస్త్ర, అన్న సంతర్పణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 2007 నుంచి తల్లిదండ్రుల పేరుతో ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు భారంగా భావిస్తున్న నేటి ఆధునిక సమాజంలో తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటూ ఏటా ఇటువంటి సామాజిక కార్యక్రమాలు నిర్వహించడాన్ని అభినందించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తి కావాలని ఆకాంక్షించారు. అలాగే కొన్న చిన్నారావు మెమోరియల్‌గా క్రీడాపోటీలు జిల్లాస్థాయిలో నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతకు క్రీడల్లో ప్రోత్సాహంగా ఉంటూ వారిలో ప్రతిభ వెలుగులోకి తీయడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో సహాయపడతాయన్నారు. కొన్న వెంకటేశ్వరరావు (వాసు) మాట్లాడుతూ తన తల్లిదండ్రులు కొన్న చిన్నారావు, చిన్నమ్మడు జ్ఞాపకార్థం వస్త్ర, అన్న సంతర్పణ కార్యక్రమం నిర్వహించడం తమ కుటుంబ సభ్యులందరికీ ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. సుమారు 700 మంది పేద ప్రజలకు వస్త్ర, అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసు కుటుంబ సభ్యులు కొన్న మధుసుదనరావు, ఎమ్మెల్యే గొండు శంకర్, సాలిహుండం సర్పంచ్ కొంక్యాన ఆదినారాయణ, ఎంపీటీసీ గుండ భాస్కరరావు, మాజీ జడ్పీటీసీ, వైస్‌చైర్మన్ మార్పు ధర్మారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ పీస రమణమూర్తి, బీజేపీ అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, టైక్వాండో శ్రీను, పూడి బాలాదిత్య, ప్రగడ అశోక్, పూర్ణచంద్రరావు, బూరవిల్లి మాజీ సర్పంచ్ మల్ల ఆగ్నేయ, తలసముద్రం ఎంపీటీసీ భావన వైకుంఠం తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలున్నాయ్.. ధాన్యాన్ని వేగంగా తరలించండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనున్న నేపథ్యంలో దీని ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఈ నెల 11, 12 తేదీల్లో ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహమ్మద్‌తో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో రైతాంగానికి వర్షాలపై అప్రమత్తం చేశారు. జిల్లాలో నూర్పులు చేసి కల్లాల్లో ఉన్న ధాన్యం తక్షణమే కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. వరి కోతలను ఈ నెల 12 వరకు వాయిదా వేసుకోవాలని కోరారు. కోతలు పూర్తయిన వారంతా తక్షణమే నూర్పులు చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరవేయాలన్నారు. పొలంలో ఉన్న వరికుప్పలను అలాగే ఉంచేయాలని కోరారు. ఈ నెల 11 నాటికి జిల్లాలో 64వేల మెట్రిక్ టన్నులు ధాన్యం నూర్పులు పూర్తి చేస్తాయని, వాటిలో 30వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మిల్లులకు చేరుతాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. వర్షాల నుంచి కాపాడుకోవడానికి రైతులకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా టార్పాలిన్స్‌ను అందిస్తున్నట్టు తెలిపారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లను ఆదేశించినట్టు తెలిపారు. జిల్లాలో 402 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1.1 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు తెలిపారు. రూ.228.73 కోట్లు రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్టు తెలిపారు. తేమ శాతం ఎక్కువ ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలని మిల్లర్లకు ఆదేశించినట్టు తెలిపారు.

# భగవద్గీత శ్లోకాల కంఠత పోటీలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గీతాజయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచారపరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నారాయణతిరుమలలో భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఆరవ అధ్యాయంపై 6,7 తరగతులు జూనియర్ విభాగం, 8, 9 తరగతులు సీనియర్ విభాగం, సంపూర్ణ భగవద్గీత 18 ఏళ్లు దాటిన వారు, దాటని వారు రెండు గ్రూపులుగా పోటీలు నిర్వహించారు. సీనియర్స్ విభాగంలో విజేతలుగా పొన్నాడ జెడ్పీహెచ్‌ఎస్ బాణ్ణ యశ్వంతి, పొన్నాడ జెడ్పీహెచ్‌ఎస్ బి.సంధ్య, సీహెచ్ మోక్షిత, జూనియర్ విభాగంలో రుషి వర్మ (కేంద్రీయ విద్యాలయం), దుంపల భవ్య (శ్రీసాందీపని విద్యాలయం), వై.హాసిని (సాయి విద్యామందిర్), సబ్ జూనియర్స్ విభాగంలో జి.యోచిత్ (శ్రీ సాయి విద్యామందిర్), బి.హరిత (నారాయణస్కూల్), డీఎస్సీ వేదిక్ (శ్రీ సాయివిద్యామందిర్) ప్రథమ ద్వితీయ తృతీయ బహుమతులను పొందారు. జి.వెంకటలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, కైలాసరావు, శ్రీకృష్ణమూర్తి, ఎస్.ధర్మారావు, దేవరాజు న్యాయ నిర్ణేయతలుగా వ్యవహరించారు. అనంతరం న్యాయనిర్ణేతలను విశ్రాంత హైకోర్టు జడ్జి గురుగుబిల్లి యతిరాజులు అధ్యక్షతన సత్కరించారు. విజేతలకు గురుగుబిల్లి శ్రీనివాసాచార్యులు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందజేసినట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ తిరుమల తిరుపతి దేవస్థానాలు ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి తెలిపారు.

# భగవద్గీత పోటీల విజేతలకు అభినందన

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తిరుమల తిరుపతి దేవస్థానం, నారాయణ తిరుమల శ్రీ వెంకటేశ్వర ఆలయ మండపంలో జరిగిన భగవద్గీత శ్లోకాల కంఠతా పోటీలలో గెలుపొందిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను పొన్నాడ జెడ్పీహెచ్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయురాలు ఎల్.అమ్మాజీ అధ్యక్షతన అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో హెచ్‌ఎం మాట్లాడుతూ నిగ్రహం, ఏకాగ్రత, ధ్యానం, వివేకం, ఆలోచనలకు భగవద్గీత పఠనం ఎంతగానో దోహదపడుతుందన్నారు. పాఠశాల స్థాయిలో ఈ శ్లోకాలపై అవగాహన, భావంపై పట్టు సాధించే విద్యార్థినీ, విద్యార్థులు చదువులో రాణించడానికి ఉపయుక్తమవుతుందనీ అన్నారు. విద్యార్థినులను శిక్షణ ఇచ్చిన ఎం.విష్ణు, ఎస్.విమలను అభినందించారు. భగవద్గీత శ్లోకాల కంఠస్తా పోటీల్లో పొన్నాడ జెడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థినులు బాణ్ణ యశ్వంతి, బోర సంధ్య ప్రథమ స్థానంలోను, పొన్నాడ రసజ్ఞ ద్వితీయ స్థానం, జూనియర్స్ విభాగంలో నేటింతి ప్రియాంక ద్వితీయ స్థానంలో నిలిచారు. హైకోర్ట్ రిటైర్డ్ న్యాయమూర్తి జి.యతిరాజులు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసరావు చేతుల మీదుగా వీరు విజేతలు ప్రశంసాపత్రం, బహుమతులు అందుకొన్నారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల బోధనా సిబ్బంది టి.బాలకృష్ణ కుమార్, ఎ.బాబూరావు, కె.శ్రీనివాసరావు, పి.అప్పలస్వామి, ఎం.సుశీల, పి.సతీష్ కుమార్, ఆర్ట్ లక్ష్మి, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# శ్రీకూర్మం హత్య కేసులో 8 మంది అరెస్టు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గార మండలం శ్రీకూర్మంలో ఈ నెల 6న జరిగిన హత్య కేసులో గ్రామానికి చెందిన 8 మందిని అరెస్టు చేసినట్టు డీఎస్పీ వివేకానంద తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి క్రైం వివరాలను వెల్లడించారు. భూవివాదమే హత్యకు కారణమని ఆయన తెలిపారు. ఉప్పాడ రాములమ్మకు చెందిన 1.40 ఎకరాల భూమిని మృతుడు రాజేష్ సహకారంతో ఉప్పాడ సూర్యనారాయణ, చుక్కా రాము, అనపాన షన్ముఖరావు కొనుగోలు చేశారనే కక్షతో దాడి చేశారని తెలిపారు. కత్తులు, గొడ్డళ్లు, కర్రలతో విచక్షణారహితంగా దారికాచి దాడి చేయడంతో రాజేష్ మృతి చెందగా, తీవ్రగాయాలపాలైన చుక్కా రాము కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. దాడి నుంచి రామును కాపాడడానికి వచ్చిన ఆయన భార్య సరోజిని గాయాలపాలైందని, దాడి నుంచి ఉప్పాడ సూర్యనారాయణ తృటిలో తప్పించుకున్నారని తెలిపారు. 2018లో భూవివాదం నేపథ్యంలోనే సూర్యనారాయణపై కొయ్య భాస్కరరావు కుటుంబ సభ్యులు దాడి చేశారని తెలిపారు. ఇప్పటికీ ఈ కేసు న్యాయస్థానంలో ఉందని, ఉప్పాడ రాములమ్మ వద్ద కొనుగోలు అగ్రిమెంట్ చేసుకున్న భూమి కొయ్య భాస్కరరావు ఆధీనంలోనే ఉందని, దీన్ని అగ్రిమెంట్ చేసుకున్నవారు స్వాధీనం చేయకుండా అడ్డుకోవడానికి ఉద్దేశపూర్వకంగానే మారణాయుధాలతో విచక్షణ రహితంగా దాడి చేశారని తెలిపారు. సూర్యనారాయణ, చుక్కా రాము, మృతి చెందిన రాజేష్ మంచి స్నేహితులని, దాడికి అదే కారణమని తెలిపారు. రాములమ్మ భూమిని కొనుగోలు చేయిండంలో కీలకంగా వ్యవహరించాడని, ప్రత్యక్షంగా కాకుండా పరోక్షంగా ఆ భూమితో రాజేష్‌కు సంబంధం ఉందని విచారణలో గుర్తించినట్టు తెలిపారు. దాని పర్యవసానమే ముగ్గురుపై దాడి చేశారని తెలిపారు. దాడిలో ప్రత్యక్షంగా ప్రమేయం ఉన్న కొయ్య భాస్కరరావు, కొయ్య రమేష్, కొయ్య లోకేష్, కొయ్య సాయికిరణ్, కొయ్య గురయ్య, గుజ్జు లక్ష్మణ, గుజ్జు రామారావు, గుజ్జు శ్రీనును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్టు తెలిపారు. వీరి నుంచి దాడికి ఉపయోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై రౌడీషీట్ తెరవనున్నట్టు తెలిపారు.

**అదుపులో కాపర్ దొంగలు**

గార పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రైమెక్స్‌తో పాటు సరుబుజ్జిలి, బొబ్బిలిలో రూ.27 లక్షలు విలువైన కాపర్ ప్లేట్స్, ట్రాన్స్‌ఫార్మర్స్‌లోని కాపర్ కేబుల్స్‌ను చోరీ చేసిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్టు డీఎస్పీ వివేకానంద తెలిపారు. సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను తీసుకువచ్చి క్రైం వివరాలను వెల్లడించారు. ట్రైమెక్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ ప్లేట్లు, కేబుల్స్ చోరీకి గురయ్యాయని వచ్చిన ఫిర్యాదుపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తు చేసినట్టు డీఎస్పీ వెల్లడించారు. కొమరవానిపేటకు చెందిన కొమర తారకేశ్వరరావుతో పాటు గాజువాక (గంట్యాడ)కు చెందిన కదిరి హరీష్, గడ్డపాటి తిలక్, చెన్ను చంటి కలిసి ట్రైమెక్స్‌లో రూ.26 లక్షలు, సరుబుజ్జిలి, బొబ్బిలి పోలీస్‌స్టేషన్ల పరిధిలో రూ.లక్ష విలువైన ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కేబుల్స్ చోరీ చేసి వాటిని గాజువాకలోని పైలా ప్రకాష్ అనే స్క్రాప్ నిర్వాహకుడికి విక్రయించినట్టు గుర్తించామన్నారు. ట్రైమెక్స్‌లోని కాపర్ ప్లేట్లు, కేబుల్స్‌ను కారులో నాలుగు సార్లు తరలించినట్టు గుర్తించామన్నారు. కారులో తరలిస్తుండగా పట్టుబడిన నలుగురిని అదుపులోకి తీసుకొని విచారించి వారి నుంచి 772 కేజీల కాపర్ ప్లేట్లను, కేబుల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చోరీ కాపర్‌ను కొనుగోలు చేసిన స్క్రాప్ నిర్వాహకుడు పైలా ప్రకాష్ పరారీలో ఉన్నట్టు తెలిపారు. పోలీసుల అదుపులో ఉన్న నలుగురు పాత నేరస్తులేనని, వీరిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నట్టు తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ పైడపునాయుడు, గార ఎస్ఐ జనార్ధనరావు పాల్గొన్నారు.





## కళింగ కార్పొరేషన్ చైర్మన్‌కు డాక్టర్ పైడి శుభాకాంక్షలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్ర కళింగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రోణంకి రామకృష్ణంనాయుడును ఇటీవల ప్రభుత్వం నియమించడంతో డాక్టర్ పైడి మహేశ్వరరావు ఆయనను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేస్తూ కళింగ కార్పొరేషన్ చైర్మన్‌గా రోణంకి నియామకంపై హర్షం వ్యక్తంచేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.